ప్రజాశక్తి
బుధవారం 3 ఏప్రిల్ 2024
5
పార్వతీపురం మన్యం

సరిహద్దు చెక్ పోస్ట్‌ను పరిశీలించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఆంధ్రా -ఒడిశా సరిహద్దయిన మూలిగూడ చెక్‌పోస్ట్‌ను డిఎస్‌పి జివి కృష్ణారావు మంగళవారం ఆకస్మికంగా సందర్శించి వాహనాలు తనిఖీలు చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రతి వాహనాన్ని జాగ్రత్తగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అనంతరం కురుపాం పోలీస్ స్టేషన్‌లో ఇటీవల 6నాటు సారా కేసుల్లో పట్టుబడిన 489.5 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేయించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎస్‌ఐ ఎస్.షణ్ముఖరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఊసరవెల్లిలా రంగులు మార్చుతూ..

రోజుకో పార్టీ మారుతున్న నాయకులు
చేరికల రాజకీయాన్ని చీదరించుకుంటున్న జనం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పార్వతీపురం నియోజకవర్గంలో గత రెండు నెలలుగా టిడిపి నుంచి వైసిపికి, వైసిపి నుంచి టిడిపిలోకి జరుగుతున్న చేరికల రాజకీయాలను చూసి జనం చీదరించుకుంటున్నారు. ఊసరవెల్లి కంటే స్పీడుగా రంగు మార్చేస్తున్న నాయకులు తీరును చూసి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మునుపెన్నడూ లేని ఈ జంపింగ్ జపాంగ్‌ల తీరును చూసి అసహించుకుంటున్నారు. ఎన్నికల ముందు రాజకీయాల్లో పార్టీలు మారడం సహజమైనప్పటికీ పార్వతీపురంలో ప్రస్తుతం జరుగుతున్న తీరు మాత్రం ప్రత్యేకం. పట్టణంలోని ఒకటో వార్డు స్వతంత్ర కౌన్సిలర్ మూడేళ్లలో వైసిపి, బిజెపి, టిడిపి పార్టీల్లో ఆయా అధినేతల సమక్షంలో కండువాలు కప్పుకున్నారు. విశేషమేమిటింటే ఒక్కో పార్టీలో ఆయన రెండేసి సార్లు చేరారు. అలాగే సీతానగరం మండలం నిడగల్లుకు చెందిన కొంతమంది ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో జనసేన నుంచి వైసిపిలోకి చేరారు. ఆ మరుసటి రోజే అదే వ్యక్తులు తాము వైసిపిలోకి చేరలేదని, సమస్యలు చెప్పుకోడానికి వెళ్తే ఆ కండువాలు కప్పేశారని ప్రకటించారు. అదే మండలం రామవరంకు చెందింన కొంతమంది టిడిపి నియోజకవర్గ ఇన్చార్జీ బోనెల విజయచంద్ర సమక్షంలో టిడిపిలోకి చేరగా, కొద్దిరోజులకే వారిలో కొద్దిమంది తాము అలజంగి జోగారావు వెంటే ఉన్నామని ప్రకటించడం విశేషం. ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడుగా పేరు పొందిన సీతానగరం మండలానికి చెందిన ఒక ప్రముఖ నాయకుడు ఆయనతో విభేదించి చంద్రబాబు సమక్షంలో టిడిపిలోకి చేరి కొద్ది రోజుల వరకు టిడిపిలో ప్రముఖపాత్ర వహించారు. అంతేకాకుండా చిన అంకలాంలో టిడిపిలోకి చేరికలను పెద్దఎత్తున ప్రోత్సహించారు. అయితే ఇంతలో ఏం జరిగిందో ఏమో కొద్దిరోజుల క్రితం వైసిపిలో చేరుతున్నట్లు ప్రకటించి, ఇప్పుడు ఎమ్మెల్యే పక్కన నిత్యం దర్శనమిస్తున్నారు. ఆయన మాట విని టిడిపిలోకి వచ్చిన వారు ఆ నాయకుని తీరు చూసి నిర్ఘాంతపోతున్నారు. అలాగే పార్వతీపురం పట్టణంలోని 25వ వార్డు మాజీ కౌన్సిలర్ భర్త గంట శ్రీనివాసరావు కొద్దిరోజుల క్రింతం వైసిపి కండువా కప్పుకున్నారు. అయితే గోడకు కొట్టిన బంతిలా మళ్లీ టిడిపి కార్యాలయంలో పచ్చకండువా కప్పుకున్నారు. ఈ వికృత క్రీడ పార్వతీపురం పట్టణంతో పాటు, బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాలలో సర్వ సాధారణమైపోయింది.

నచ్చిన పార్టీలో చేరి ఆపార్టీకి సేవలందించడంలో ఏమాత్రం తప్పులేకపోయినా ఇంత స్పీడ్‌గా పార్టీలను మార్చడం పట్ల జనం ఎవగించుకుంటున్నారు. ఒక నాయకుడిని గానీ, కార్యకర్తను గానీ పార్టీలో చేర్చుకున్నారంటే, సదరు వ్యక్తి తన వెనుకనున్న వారిని ప్రభావితం చేసింది ఓటురూపంలో మార్చి, తమకు ఎంతో కొంత మేలు చేస్తారన్న ఉద్దేశ్యంతో ఇతర పార్టీల నుంచి తమ పార్టీలోకి నాయకులు ఆహ్వానించడం సహజం. కానీ ఊసరవెల్లుల కంటే వేగంగా రంగులు మార్చే ఇటువంటి నాయకులు పార్టీలు మారుతున్నారంటే ఎవరూ నమ్మరు. ఇలాంటి వారు ఇతరులపై ఏమేరకు, ప్రభావం చూపిస్తారు. వీరి మాటాలను ఏమేరకు విశ్వసించి ఓట్లు వేస్తారు. ఇటువంటి ప్రయత్నాలు రాజకీయ నాయకులు మానుకుని తనతో ఉన్న పాత వారినే నమ్ముకుని ఎన్నికల్లో ముందుకు వెళ్లడం మంచిదని, తనను గెలిపిస్తే అంకితభావంతో పనిచేసే నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తానని ప్రజల్లో విశ్వాసం కల్పించాలి. ఇలా ఊసరివిల్లాలా రంగులు మార్చే సంప్రదాయానికి వెంటనే చెక్ పెట్టాలని, ఇరు పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు కోరుతున్నారు.

తొలుత వైసిపిలో చేరి... అనంతరం టిడిపిలో చేరిన పట్టణ నాయకులు

జిల్లా కేంద్రాస్పత్రి రెసిడెంట్ మెడికల్ అధికారిగా శ్యామల

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా కేంద్రాసుపత్రి సీనియర్ రెసిడెంట్ మెడికల్ అధికారిగా ఇదే ఆసుపత్రిలో ఆప్తామాలిక్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా పని చేస్తున్న డాక్టర్ కె.శ్యామల బాధ్యతలు నిర్వహిస్తారని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలను డాక్టర్ ఎన్‌కెఆర్‌ఎస్ శేషగిరి నిర్వహించేవారన్నారు. పాలనాపరమైన అంశాల్లో భాగంగా ఈ మార్పు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థులుగా సామాన్యులు

ఉమ్మడి విజయనగరంలో ఏడు స్థానాలకు ప్రకటన

విజయనగరం జిల్లా

సుంకరి సతీష్‌కుమార్
విజయనగరం

గాదపు కూర్మినాయుడు
గజపతినగరం

తమ్మగంటి శ్రీనివాస నాయుడు
చీపురుపల్లి

కంబాల రాజవర్ధన్
రాజాం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా పలు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులను అధిష్టానం ప్రకటించింది. 114 అసెంబ్లీ స్థానాల్లో బరిలోకి దింపనున్న అభ్యర్థుల జాబితాను పిసిసి విడుదల చేసింది.ఇందులో భాగంగా విజయనగరం జిల్లా పరిధిలో నాలుగు, పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వీరంతా సామాన్యులు కావడం విశేషం. విజయనగరంలో సుంకరి సతీష్‌కుమార్, గజపతినగరం నుంచి గాదపు కూర్మినాయుడు, చీరుపుపల్లి నుంచి తుమ్మగంటి శ్రీనివాస నాయుడు, రాజాం నుంచి కంబాల రాజవర్ధన్ బరిలోకి దిగనున్నారు. ఇంకా నెల్లిమర్ల, ఎస్.కోట, బొబ్బిలి నియోజకర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సివుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం అభ్యర్థిగా బత్తిన మోహనరావు, సాలూరు అభ్యర్థిగా మువ్వల పుష్పారావు, పాలకొండ అభ్యర్థిగా సరవ చంటిబాబు ఉన్నారు. ఈ రెండు జిల్లాల్లో ఇప్పటి వరకు ప్రకటించిన వారిలో అంతా సామాన్యులే. కొందరికి గ్రామ, మండల స్థాయిలో స్థానిక, సామాజిక సమస్యలపై పోరాడిన నేపథ్యం ఉంది. వీరిలో సతీష్‌కుమార్ విజయనగరంలోని మంగళ వీధికి చెందినవారు. డిసిసి మాజీ అధ్యక్షులు కీర్తిశేషులు యడ్ల ఆదిరాజుకు స్వయాన మేనల్లుడు. బిఎ పూర్తిచేసిన ఆయన చాలా ఏళ్లగా కాంగ్రెస్‌లో ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేశారు. ప్రస్తుతం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. చీపురుపల్లి అభ్యర్థి తుమ్మగంటి సూరి నాయుడు గరివిడి మండలం గడ్డపువలసకు చెందినవారు. 2021లో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తొలుత ప్రజారాజ్యంలో పార్టీ రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా, విశాఖపట్నం జిల్లా ఇంఛార్జ్‌గా పనిచేశారు. అనంతరం జనసేన, ఆ తరువాత వైసిపిలో చీపురుపల్లి ఇంఛార్జిగా పనిచేశారు. 2014లో వైసిపి ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించారు. రాజాం నియోజకవర్గం అభ్యర్థి కంబాల రాజవర్ధన్ పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండ మండలం, చిన్న మంగళాపురం గ్రామానికి చెందినవారు. తండ్రి కంబాల రాజరత్నం గతంలో పాలకొండ ఎమ్మెల్యేగా సేవలందించారు. విదేశాలలో కొన్నేళ్లపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారు. 2018 నుంచి రాజాం నియోజకవర్గంలోనే కాంగ్రెస్ పార్టీ తరపున పనిచేస్తున్నారు. గజపతినగరం అభ్యర్థి గాదపు కూర్మినాయుడు దత్తిరాజేరు మండలం గొభ్యాం గ్రామానికి చెందిన వారు. సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న నేపథ్యం ఉంది. చాలా కాలంగా కాంగ్రెస్ అభిమానిగా ఉన్నారు. పార్వతీపురం అభ్యర్థి బత్తిన మోహన్‌రావు పాలకొండ ప్రాంతానికి చెందినవారు. తొలుత శ్రీకాకుళం జిల్లా యూత్ కాంగ్రెస్‌లో పనిచేశారు. వృత్తిరీత్యా న్యాయవాది. ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ సమస్యలపై పనిచేసిన నేపథ్యం ఉంది. 20ఏళ్లగా అఖిల భారత దళిత హక్కుల ఫోరం, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి న్యాయవాదుల ఫోరం లో పని చేస్తున్నారు. పాలకొండ కాంగ్రెస్ అభ్యర్థి సవర చంటిబాబు సీతంపేట మండలం కుసిమి పంచాయతీ బంగారుగూడకు చెందినవారు. తండ్రి సవర తోటయ్య గతంలో కుసిమి పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఈ కుటుంబం తొలి నుంచీ కాంగ్రెస్‌తోనే ఉంది. రాష్ట్ర విభజన తరువాత కూడా అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. సాలూరు అభ్యర్థి మువ్వల పుష్పారావు సాలూరు మండలం తుండ పంచాయతీ జగ్గుదొర వలసకు చెందిన గిరిజన యువకుడు. గిరిజన సమస్యలపై గత కొంతకాలంగా పోరాటాలు చేస్తున్నారు. పోలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేశారు. షెడ్యూల్ గ్రామాల యువకులకు ఉద్యోగాల కోసం షెడ్యూల్ ధ్రువపత్రాలు మంజూరు చేయాలని జగ్గుదొరవలస కేంద్రంగా ఉద్యమం నిర్వహించారు.

పార్వతీపురం మన్యం జిల్లా

బత్తిన మోహనరావు
పార్వతీపురం

మువ్వల పుష్పారావు
సాలూరు

సవర చంటిబాబు
పాలకొండ

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కృష్ణమూర్తి

సిపిఎం, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రానున్న ఎన్నికల్లో సిపిఎం, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం, ఇండియా గ్రూపు అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సిపిఎం పార్టీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. మతోన్మాదం, రాజ్యాంగ విచ్ఛిన్నకర విధానాలను అనుసరిస్తున్న రాష్ట్ర ప్రయోజనాలను, హక్కులను దెబ్బతీసిన, అధిక ధరలతో భారాలు పెంచుతున్న బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. అలాగే బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇస్తూ బలపరుస్తున్న లొంగిపోయిన రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేనను ఓడించాలని కోరారు. ప్రజాప్రయోజనాలను, రాజ్యాంగాన్ని, హక్కులను కాపాడే సిపిఎం అరకు అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.అప్పలనర్స, ఇండియా గ్రూపులో భాగస్వామ్యులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు బంటు దాసు, గొర్లె వెంకటరమణ, కె.రామస్వామి, బంకులు సూరిబాబు, టి.రాము, కృష్ణ, పార్టీ కార్యకర్తలు, సానుభూతి పనులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రారెత్తిస్తున్న ఎండలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గత వారంరోజులుగా తన ప్రతాపం చూపిస్తున్న భానుడు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ నిప్పులు కురిపించాడు. అందుకు నిదర్శనం మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలను చూస్తే అర్థమౌతుంది. సాలూరులో అత్యధికంగా43.1 డిగ్రీలు నమోదు కాగా, కురుపాం 41,6, గుమ్మలక్ష్మీపురం41.6, సీతానగరం 40.2, పార్వతీపురం 40, భామిని 4 1.6, పాలకొండ41.6, జియ్యమ్మవలస 41.6, పాచిపెంట 40.2, మక్కువ 40.9, సీతంపేట 40, బలిజిపేట 40.9, కొమరాడ 38.7, వీరఘట్టం 41.6, గరుగుబిల్లి 39.9 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 7గంటల నుంచే వాతావరణం వేడెక్కడంతో ఉపాధిహామీ కూలీలు పనులు సక్రమంగా నిర్వహించలేక పోతున్నారు. రానున్న రోజుల్లో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ, విపత్తుల నివారణ శాఖకు చెందిన అధికారులు హెచ్చరిస్తున్నందు వల్ల ప్రజలు గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల డీహైడ్రేషన్ పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఉదయం 10గంటల తర్వాత బయటకు రాకూడదని, వచ్చినా నూలు దుస్తులు ధరించడం, శీతలపానీయాలు సేవించడంతో పాటు తప్పనిసరిగా తలకు టోపీలు ధ రించాలని జిల్లా కేంద్ర అసుపత్రి సూపరిండెంట్ డా. వాగ్దేవి సూచిస్తున్నారు.

గుమ్మలక్ష్మీపురం : జిల్లాలో భానుడు భగభగలాడుతున్నాడు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. మంగళవారం అత్యధికంగా 41 డిగ్రీలు నమోదయ్యాయి. ఏప్రిల్ ప్రారంభంలో మండే ఎండలతో వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఏప్రిల్, మే, జూన్‌లో విపరీతమైన వేడి గాలులు ఉంటాయని ఐఎండి హెచ్చరికలు జారీ చేస్తుంది. ఎండల ప్రభావం అధికంగా ఉండడంతో ప్రజలు ఇంటి నుంచి రావడానికి భయపడుతున్నారు. మధ్యాహ్న సమయాల్లో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండలను దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు కళ్లకు ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండల ప్రభావం వృద్ధులు గర్భిణీలు చిన్నారులపై ఎక్కువగా ఉంటుందని వైద్యులు అంటున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చల్లటి పానీయాలు తీసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ, గొడుగు, తెల్లటి దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

ఎండలకు గుమ్మలక్ష్మీపురంలో బోసిపోయిన ప్రధాన రహదారి

వ్యర్థాలను శుద్ధి చేసే యంత్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఆర్‌డి నాగరాజు

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ : ఆర్‌డి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీ పరిధిలోని పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ చేసి పారిశుధ్య పనులను చేపట్టాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు అన్నారు. మంగళవారం స్థానికమున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆయన కమిషనర్ కె.శ్రీనివాస్, డిఇ కిరణ్ కుమార్, ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళిలత కలిసి డంపింగ్ యార్డును, గ్యాస్ ఆధారిత స్మశాన వాటికను, బెలగాంలో ఉన్న ప్రజారోగ్య విభాగం రెండో కార్యాలయంలో వ్యర్థాలను శుద్ధి చేసే యంత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీజియన్‌లో 85 శాతం పన్నులు వసూలు జరిగాయన్నారు. పట్టణంలో 30 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అపార్ట్మెంట్లు, హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్తలను, వ్యర్థాలను సేకరించి ఆ ప్రాంతంలోనే సేంద్రియ ఎరువులను తయారు చేసేలా కృషి చేయాలని, అసంపూర్తిగా నిలిచిపోయిన గ్యాస్ ఆధారిత శ్మశాన వాటిక పనులను 15వ ఆర్థిక సంఘం నిధులను వెచ్చించి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వేసవి దృష్ట్యా తాగునీరు సరఫరా సక్రమంగా ఇవ్వాలన్నారు. ప్రజారోగ్య విభాగంలో డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులు అర్‌డిని కలిసి తమను డ్రైవర్లుగా గుర్తించాలని కోరడంతో, పార్టీ స్పందిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపి వీరిని డ్రైవర్లుగా గుర్తించాలని కమిషనర్‌కు సూచించారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసేలా

అన్ని పార్టీలూ అజెండా ప్రకటించాలి

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ, కార్పొరేషన్, నగరపంచాయితీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసేలా అన్ని రాజకీయ పార్టీలు అజెండా ప్రకటించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేప్వరరావు కోరారు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో కార్మికులు - సవాళ్లు అన్న అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల ముందు అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలను ప్రకటిస్తాయని, మున్సిపల్ కార్మికుల పర్మినెంట్ చేసేలా ప్రతిపాదనలను ఆయా పార్టీల అజెండాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ చట్టాలను నిర్వీర్యం చేసేలా ముందుకు వెళ్తున్నాయని విమర్శించారు. లేబర్ కోడ్, ఇతర కార్మిక చట్టాలతో మోడీ ప్రభుత్వం కార్మికులపై దాడులు చేస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు కేంద్రాన్ని నిలదీసే పరిస్థితిలో లేవని చెప్పారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ పాలకవర్గాలు నిధులు లేక దయనీయ స్థితిలో ఉన్నాయని, కార్మికుల కనీస అవసరాలు తీర్చలేని దుస్థితిలో ఉన్నారని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు నూకరాజు మాట్లాడుతూ పోరాటం ద్వారానే కార్మికుల సమస్యల్ని పరిష్కరించుకోగలమన్నారు. హక్కులు, చట్టాలను కాపాడుకోగలమని చెప్పారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కమిటీ సభ్యులు పోలరాజు, పర్మినెంట్ కార్మికుల సంఘం నాయకులు వెంకట్రావు, బోగీసు, కూర్మారావు, మీడియా ఇంఛార్జి రవి పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

మాజీ ఎమ్మెల్యే జయరాజ్‌పై వేటు వేస్తాం

బిజెపి ఎమ్‌పి అభ్యర్థి కొత్తపల్లి గీత

ప్రజాశక్తి - సాలూరు

తనపై తీవ్రమైన ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే, బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు నిమ్మక జయరాజ్‌పై బిజెపి అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందని అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత చెప్పారు. మంగళవారం పట్టణానికి వచ్చిన ఆమె మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్తపల్లి గీత నకిలీ గిరిజన నాయకురాలని, ఆర్థిక నేరస్తురాలని ఆరోపిస్తూ జయరాజ్ విమర్శించారు. దీనిపై ప్రశ్నించగా గీత స్పందిస్తూ తనపై చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు లేవని, వాటి గురించి న్యాయవాదులు చూసుకుంటున్నారని చెప్పారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరిని కూడా జయరాజ్ తీవ్రంగా విమర్శించిన నేపథ్యంలో ఆయన పై ఒకటి, రెండు రోజుల్లో సస్పెన్షన్ వేటు పడుతుందని చెప్పారు. సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణితో తనకు ఎలాంటి విభేదాల్లేవని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కలిసి కట్టుగా ఎన్డీయే కూటమి గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. వివాదాస్పద కొటియా గ్రామాల వ్యవహారం లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాస్తానని అన్నారు. వైసిపి ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో గిరిజన అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని చెప్పారు. జీవో 3పై రాష్ట్ర ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదని చెప్పారు. దీని వల్ల గిరిజన యువకులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని చెప్పారు. గతంలో తాను ఎంపీగా అనేక సమస్యల్ని పార్లమెంటులో ప్రస్తావించానన్నారు. ఎంపిగా గెలిస్తే గిరిజన యూనివర్సిటీని మన్యం జిల్లాలో ఏర్పాటు కోసం కృషి చేస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ మాట్లాడుతూ కొటియా గ్రామాల విషయంలో వైసిపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందని చెప్పారు. ఒడిశా ప్రభుత్వమే కొటియా గ్రామాల్లో రోడ్లు నిర్మించిందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ మన్యంలో ఇద్దరు గిరిజనులు గడిచిన ఐదేళ్లలో మంత్రులుగా పని చేశారని, గిరిజన సమస్యల్ని పట్టించుకోలేదని అన్నారు. డిప్యూటీ సిఎంలుగా పని చేసిన పుష్ప శ్రీవాణి, రాజన్నదొర ఐదేళ్లలో కనీసం ఐటిడిఎ పాలకవర్గ సమావేశం నిర్వహించలేక పోయారని విమర్శించారు. మూడు నెలలకోసారి పాలకవర్గ సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఒక్క సమావేశం కూడా నిర్వహించకపోవడంతో గిరిజన సమస్యలు పక్కదారి పట్టాయని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ఓట్లు అడిగే హక్కు వైసిపికి లేదని జగదీష్ అన్నారు. సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, బిజెపి మన్యం జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అరకు ఎమ్‌పి సీటును నిజమైన ఆదివాసీలకే కేటాయించాలి : నిమ్మక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/కురుపాం

అరకు పార్లమెంటు నియోజవర్గానికి బిజెపి తరపున పోటీ చేయుచున్న కొత్తపల్లి గీత ఎస్‌టి కాదని తమ వద్ద తగిన ఆధారాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నిమ్మక జయరాజు ఆరోపించారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం, కురుపాంలో విలేకరులతో మాట్లాడుతూ 2014 పార్లమెంట్ ఎన్నికల్లో తప్పుడు అఫిడివెట్లు దాఖలు చేసి ఎంపిగా ఎన్నికయ్యారన్నారు. ఆ సమయంలో వివిధ ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఆమెపై కుల నిర్ధారణ ధ్రువీకరణ పత్రంపై ఫిర్యాదులు చేశాయన్నారు. డిఎల్‌సి కమిటీ ద్వారా కుల ధ్రువీకరణ పత్రం పొంది ఉన్నత స్థాయి అధికారులచే కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్నారని న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఆమె ఎస్‌టి కాదని తీర్పు వెలువడిందని ఆయన అన్నారు. ఆమె సోదరుడు ఎస్టీ కాదని జిల్లా కలెక్టర్ ధ్రువీకరించి కొట్టివేయగా, అదే కలెక్టరు ఈమె ఎస్టీకి చెందినదని హైలెవెల్ కమిటీకి సిఫార్సు చేశామన్నారు. ప్రస్తుతం ఆమె కులంపై న్యాయస్థానాల్లో విచారణ జరుగుతున్నప్పుడు ఏ విధంగా ఎంపి సీటుకు అర్హులవుతారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి నాగూరు వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు వైవి సుబ్బారెడ్డి

వైసిపి పాలనలో పేదలకు లబ్ధి : వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వైసిపి పాలనలో రాష్ట్రంలోని పేదలకు ఎన్నడూ లేని విధంగా ఆర్థిక లబ్ధించే కోరిందని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన పార్వతీపురంలో మంగళవారం నిర్వహించిన బూత్ కన్వీనర్లు సమన్వయకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ నియోజకవర్గానికి ఐదేళ్లలో రూ.1540 కోట్ల రూపాయల లబ్ధి లక్షకు పైగా పేద కుటుంబాలకు అందాయన్నారు. కావున ఎన్నికల వరకు కార్యకర్తలు, నాయకులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రతి లబ్ధిదారుడ్ని కలిసి వారికి జరిగిన మేలును వివరిస్తూ ప్రభుత్వానికి మద్దతు అడగాలని అన్నారు. కార్యక్రమంలో ముందుగా విజయనగరం జిల్లా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు తూముల భాస్కరరావు, వాకాడ నాగేశ్వరరావు తదితరులు కార్యకర్తలు ఉద్దేశించి మాట్లాడారు.

ముమ్మరంగా ఎమ్మెల్యే ప్రచారం

ప్రజాశక్తి -భామిని

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరాయని, మీ కుటుంబం వైసిపి హయాంలో లబ్ధిపొందితేనే తనకు ఓటేయాలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి కోరారు. మండలంలోని లివిరి, భామిని, బాలేరు, నల్లారాయి గూడ పంచాయతీల్లో మంగళవారం ఆమె ఎన్నికల ఎన్నికలు ప్రచారం నిర్వహించారు. ముందుగా లివిరి గోపినాథస్వామిని దర్శించుకుని ఎన్నికలు ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, జెసిఎస్ కో ఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, ఎంపిపి తోట శాంతికుమారి, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి చిన్నమి, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, నాయకులు కె.రామారావు, ఆర్.రమేష్, పి.మజ్జి, ఎం.చలపతిరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయకు జవహర్ ఎంపిక

ప్రజాశక్తి -భామిని

మండలంలోని గురండికి చెందిన శివ్వాల మోహిత్ జవహర్ నవోదయకు ఎంపికైనట్లు విద్యా వికాస్ హై స్కూల్ ప్రిన్సిపల్ ఎం.గాంధీరాజు తెలిపారు. మోహిత్ తండ్రి శివ్వాల సతీష్ రైతు కాగా, తల్లి గృహిణి అని తెలిపారు. విద్యా వికాస్ పాఠశాలలో అభ్యసించి, నవోదయలో సీటు సంపాదించిన మోహిత్‌కు పాఠశాల ప్రిన్సిపల్ స్వీట్ తినిపించి అభినందించారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని గరుగుబిల్లి, పెద్దురులో మంగళవారం స్థానిక ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ అమ్మన్నరావు అన్నారు. అలాగే సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆర్‌పిఎఫ్‌కు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో టిడిపి అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గొటివాడ పంచాయితీ పరిధిలో గల గొటివాడ, బల్లుకోట, తెన్నుఖర్జ గిరిజన గ్రామాల్లో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి మంగళవారం బాబు షూరిటీ, సూపర్ సిక్స్ పథకాల గూర్చి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కొండయ్య, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, టిడిపి నాయకులు ప్రశాంత్, మాసయ్య, గంగులు, బుడ్డు, మహేష్, చంటి, ప్రవీన, సాయి, ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రామవరం, అంటిపేటలో పోలింగ్ కేంద్రాలను సిఐ కె.రవికుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న 20056 కూలింగ్ కేంద్రాలు ఇందులో 23 గ్రామాలు సమస్యాత్మకంగా గ్రామాలను, నాలుగు గ్రామాలు నక్సలైట్ ప్రాంతాలని తెలిపారు. ఈ కేంద్రాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిందన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీలపై నాయకులు టీం వేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలకు ముందుగా అవగాహన కల్పించడం జరుగుతుందని, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పెంచిన ఉపాధి వేతనాలు అమలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఉపాధిహామీ చట్టంలో భాగం చేపడుతున్న పనులు చేస్తున్న వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం పెంచిన గరిష్ట వేతనం రూ.300 బుధవారం నుంచి అమల్లోకి రానుంది. అయితే గడిచిన ఆర్థిక సంవత్సరంలో గరిష్ట వేతనం రూ.272 అమల్లో ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి మొదలయ్యే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి రూ.300 గరిష్ట వేతనం నిర్ణయిస్తూ జీవో జారీ చేశారు. ఉపాధిహామీ చట్టం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి ఏడాదికి వంద రోజులతో పాటు పనులు చేసుకునే వెసులు బాటు ఉన్న నేపథ్యంలో కేంద్రం ఈతాజా పెంపు నిర్ణయం పట్ల వేతనదారులు అదనపు లబ్ధి పొందే అవకాశం ఉంది. అలాగే మండలంలో దాదాపు 10,700 జాబ్ కార్డులున్నాయని ఎపిఒ మండల గౌరీనాథ్ తెలిపారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నిడగల్లు, కాశీపేట గ్రామ సచివాలయాల కార్యదర్శులు తిరుపతిరావు, మురళీకృష్ణ ఆధ్వర్యంలో చలివేంద్రాలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీరందించాలని, ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ

పార్వతీపురం టౌన్ : లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ వార్డు సచివాలయాల సెక్రటరీలతో ఈనెల 4న పంపిణీ చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్, ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల మేరకు పట్టణంలోని అన్ని వార్డుల్లో గల 5,557 పెన్షన్లను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నేరాలు ఘోరాలు

200 లీటర్లు సారా పట్టివేత

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మండ గ్రామ సమీపంలో గల జీడితోట వద్ద 200 లీటర్ల నాటుసారాతో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎం.జగదీశ్ నాయుడు తన సిబ్బందితో పెట్టుకున్నారు. వారిపై ఎస్ఐ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. సారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. సారా వంటకాలకు ముడి సరుకు తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నాటు సారా రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐతో పాటు ఎఎస్ఐ సంజీవ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని చినగోరకు సమీపాన సారా తయారీ కేంద్రంపై మంగళవారం స్థానిక ఎస్ఐ ఎస్‌కె ఫక్రుద్దీన్ దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఈ దాడుల్లో 12 ప్లాస్టిక్ డ్రమ్ముల్లో సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 1800 లీటర్ల బెల్లపు ఊటలు ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు సిబ్బంది కూడా ఉన్నారు.

ఆశా వర్కర్లు అందుబాటులో ఉండాలి : డిఐఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

ఆశాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎం.నారాయణ ఆదేశించారు. ఆశాడే సందర్భంగా మండలంలోని బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికల్లో రక్తహీనతని గుర్తించి వారికి హిమోగ్లోబిన్ పెరిగేలా కృషి చేసే వరకూ పర్యవేక్షించాలన్నారు. అవసరమైతే వైద్యాధికారి సలహా తీసుకోవాలని సూచించారు. అలాగే ఐదేళ్లలోపు పిల్లల్లో పోషకాహారం ఎదుగుదల లోపం గుర్తించి వాటికి అధిగమించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందేలా బాధ్యత తీసుకోవాలన్నారు. అంతకుముందు వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆశా కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, నితీశా, సూపర్వైజర్లు జయగౌడు, శ్రీనివాస్, కె.జనార్ధన్, ఒ.శాంతి కుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యల గుర్తింపులో ఆశాలే కీలకం

కురుపాం : క్షేత్ర స్థాయిలో ప్రజల ఆరోగ్య సమస్యలు సత్వరమే గుర్తించడంలో ఆశా కార్యకర్తలే కీలక బాధ్యత తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. మంగళవారం మొండెంఖల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఆశాడే కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించి సమాచారాన్ని చేరవేయడంలో ఆశా కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులు, దీర్ఘకాలిక రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, హైరిస్క్ ఆరోగ్య సమస్యలు గుర్తించిన వెంటనే ఉన్నత స్థాయి సిబ్బందికి తెలియజేయలని సూచించారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, వైద్యాధికారులు డాక్టర్ అభినవ్‌కుమార్, డాక్టర్ అమరసింహారెడ్డి, సూపర్ వైజర్లు విజయలక్ష్మి, శ్రీహరి, రాజులమ్మ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఎండల తీవ్రతపై జాగ్రత్తలు అవసరం

జియ్యమ్మవలస : జిల్లాలో రోజు రోజుకు పెరుగుతున్న ఎండలకు చిన్న పిల్లలు, బాలింతలు, గర్భిణీలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.పి.జగదీష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎంఎస్ఎం, సిహెచ్ఒ, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి పరిధిలో ఉన్న సిబ్బంది వేసవిలో ప్రజలు ఎలాంటి వ్యాధుల బారినపడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గర్భిణుల ఆహారం, రక్తహీనత, గర్భిణులను గుర్తించడం, ప్రసవాలు, స్కేటింగ్ల వినియోగం, చెడు అలవాట్లు వాటి ప్రభావం మొదలైన అంశాలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, లక్ష్మీ కాంతం, విజయం, హైమావతి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

స్లిప్పులు చూపుతున్న గిరిజనులు

బయోమెట్రిక్ వేయించారు... రేషన్ మరిచారు

ప్రజాశక్తి - కురుపాం

బయోమెట్రిక్ వేయించి స్లిప్పులు ఇచ్చి మార్చి నెల రేషన్ బియ్యం ఇవ్వడం మానేసిన సంఘటన మండలంలోని ఉదయపురం పంచాయతీలో చోటు చేసుకుంది. ఈ పంచాయతీ పరిధిలో గల కొత్తగూడ, సంజువాయి,రెల్లిగూడ, కంటుగూడ, మల్లిగూడ, కాకితాడ, జాకిరిగూడ, మట్టిగూడ తదితర గ్రామాల్లో 410 రేషన్ కార్డుల లబ్ధిదారులకు మార్చి నెల రేషన్ ఇవ్వడం మానేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల గిరిజనులు మాట్లాడుతూ మార్చి నుంచి ఆన్‌లైన్ అయ్యిందని, అంతకుముందు బయోమెట్రిక్ వేసి పూర్తిగా రేషన్ ఇవ్వడం మానేసి ఇప్పుడు ఏప్రిల్‌లో బయోమెట్రిక్ కోసం వచ్చారని తెలిపారు. గతంలో ఆఫ్లైన్లో ఉండేటప్పుడు కూడా సగం బియ్యం ఇచ్చి సగం ఇవ్వలేదని, అంగన్వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు కూడా సక్రమంగా రేషన్ ఇవ్వలేదని అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు వారు స్పందించలేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు రేషన్ బియ్యం సక్రమంగా అందేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై ప్రజాశక్తి సివిల్ సప్లయ్ డిటిని సంప్ర దించగా, విఆర్ఒను పూర్తిగా దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వమని ఆదేశించామని తెలిపారు.


డిఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న గిరిజనసంఘం నాయకులు

కొటియా సరిహద్దు సమస్యపై చొరవ చూపాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఒడిశా ప్రభుత్వం గిరిజనులపై దాడిని ఆపాలని, కొటియా సరిహద్దు సమస్యపై రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారానికి చొరవ చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు సాలూరు మండలం గంజాయి భద్ర పంచాయితీ గ్రామాల గిరిజనులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారికి మంగళవారం వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా ఒడిశా ప్రభుత్వం కొఠియా గ్రామాల ప్రజలు సాగు చేస్తున్న భూములను అభివృద్ధి పేరిట బలవంతంగా భూములు లాక్కుంటుందన్నారు. కనీసం సమాచారం గానీ, ఎటువంటి గ్రామసభలు గానీ నిర్వహించకుండానే అనుమతులు అడ్డగోలుగా ఇస్తున్నారని అన్నారు. ఇదేమని అడిగితే తమపై దాడులు, దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతమంతా షెడ్యూల్ ఏరియాగా ఉందని, ఈ ప్రాంతంలో ఉన్న అన్ని వనరులపైన సర్వ హక్కులు గిరిజనులనని అన్నారు. ఇవేవీ పట్టించుకోకుండా ఒడిశా ప్రభుత్వం తమపై దౌర్జన్యం చేస్తుందన్నారు. అడ్డుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గిరిజనులకు అండగా ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేసి, రక్షణ కల్పించాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, నాయకులు వసంతుల సుందరరావు, తాడంగి రాజు, సానం, అజయ్, టి.గాసి తదితరులు ఉన్నారు.

పాంచాలిలో ప్రచారం చేస్తున్న రాజన్నదొర

పింఛన్ల కోసం డిప్యూటీ సిఎంకు మొర

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పాంచాలిలో మంగళవారం డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు వితంతువులు, వికలాంగులు పింఛన్ ఇంకా అందలేదు దొర అంటూ పలువురు లబ్ధిదారులు రాజన్నదొరకు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు, వికలాంగులకు ఒకటో తేదీ వేకువజామున వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించేవారని, అటువంటి వాలంటీర్లపై టిడిపి, జనసేన ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి తొలగించారని, అందువల్లే మీరు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాలు అందవని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నారాయణరావు, పెద్దిబాబు, పి.వీరమనాయుడు, మండల వైసిపి అధ్యక్షులు గొట్టాపు ముత్యాలునాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు, గ్రామస్తులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

విద్యుత్‌ను ఆదాచేద్దాం

ప్రజాశక్తి - కురుపాం

విద్యుత్‌ను ఆదా చేద్దాం భావితరాలకు భవిష్యత్తునిద్దామని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎనర్జీ క్లబ్ సంబంధించి కరెంటు పొదుపుపై ప్లే కార్డులతో కురుపాంలో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్‌ను ఏ విధంగా వినియోగిస్తే తక్కువ బిల్లు వస్తుందో ఎలా ఆదా చేయగలం అన్న దాని గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ కరెంటును ఆదాతో వాడి భావితరాలకు భవిష్యత్తును ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

143 మందికి ఆరోగ్య తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి ప్రదీప్ 143 మందికి వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ఎండల తీవ్రతలను ఎదుర్కొనేందుకు వీలుగా వైద్యాధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ శాంతి కుమారి, ఎఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, తదితరలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో పెన్షన్ పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకొని పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పింఛన్లు సత్వరమే అందజేయాలి : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ కార్యదర్శుల ద్వారా పెన్షన్‌దారులకు చెల్లింపులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి ఎంపిడిఒ జగదీష్‌కుమార్‌కు మంగళవారం వినతి అందించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి సొంత కాంట్రాక్టర్లకు రూ.13వేల కోట్ల బిల్లులు చెల్లింపు జరగడంతో ఖజానా ఖాళీ అయిందన్నారు. దీంతో వికలాంగులు, వృద్ధులకు పెన్షన్ అందించకపోవడం విచారకరమన్నారు. ఖజానాలో ఉన్న సొమ్ము ఖాళీ చేయడం వల్ల ఇటువంటి పరిస్థితి నెలకొందని ఆమె తెలిపారు. తప్పులు చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షాలపై, కేంద్ర ఎన్నికల అధికారులపై తప్పును నెట్టేయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, నియోజకవర్గ మహిళా కార్యదర్శి కె కళావతి, తిమ్మక ధర్మారావు, కిల్లక దాసు, కె వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని వితంతు, వృద్ధాప్య, వికలాంగ, తదితర పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందించాలని స్థానిక ఎంపిడిఒ ఎంవిబి సుబ్రమణ్యంకు మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, నీలకంఠనాయుడు, బల్ల హరిబాబు, టి రమేషు, వి.శ్రీనివాసరావు, శశి కుమార్ ఎన్, ఆర్ తాతబాబు, జి.గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : ప్రతి లబ్ధిదారునికి ఇంటికి వెళ్లి పింఛను అందజేయాని మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యనారాయణ, ఆర్.వేణుగోపాల్ నాయుడు అన్నారు. ఈ మేరకు ఎంపిడిఒ ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.శ్రీనివాసరావు, సర్పంచి జొన్నాడ తెరేజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : వృద్ధులు, వికలాంగులు, ఇతర పెన్షన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, మండల కన్వీనర్ కెవి కొండయ్య మంగళవారం స్థానిక ఎంపిడిఒ ఎస్.అప్పారావుకు వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. పెన్షన్లను సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శుల సేవలను వినియోగించుకుని లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే అందించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రి శ్రీను, బోటు గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న టిడిపి అభ్యర్థి జగదీశ్వరి

కొమరాడ : వృద్ధులు, వికలాంగులు, ఇతర పెన్షన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని, వాలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి గులిపల్లి సుదర్శనరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపిడిఒకు వినతిని అందజేశారు. వినతిని అందజేసిన వారిలో నంగిరెడ్డి మధుసూధనరావు, మండల ఉపాధ్యక్షులు పడాల హరి, యూనిట్ ఇంచార్జ్ బొంగు భానుజీ రావు, కుమ్మరి గుంట సర్పంచ్ గొర్లి లక్ష్మణ రావు, బత్తిలి శ్రీను, పాలక నూకరాజు, గులిపల్లి మురళి, మారిసర్ల సత్యనారాయణ, బిద్దిక తమ్మయ్య, నీరస శ్రీను,సర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అనుచరులకు నిధులు... పింఛనుదారులకు మొండిచేయి

జగన్ తీరుపై సాలూరు టిడిపి అభ్యర్థిని గుమ్మిడి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు అని చెప్పి పెన్షన్లను వెనక్కి నెట్టి అదే ఆర్థిక సంవత్సరం ముగింపు అర్ధరాత్రి నిధులను తన అనుచరులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏ విధంగా దోచి పెట్టారో దీనికి సమాధానం చెప్పాలని సాలూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ప్రశ్నించారు. మండలంలోని మరిపల్లి వద్ద సాలూరు మండల స్థాయి క్లస్టర్ బూత్ ఇన్చార్జిల ఆధ్వర్యంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతి సమావేశంలో నేరుగా బటన్ నొక్కితే లబ్ధిదారులకు వారి అకౌంట్లోకి నగదును వేస్తున్నామని అనుకున్న సమయానికి అనుకున్నట్లు వేస్తున్నామని తెలుపుతున్నారు. కానీ ఒకటో తారీకున ఇవ్వాల్సిన పెన్షన్లను, జనవరి 23న బటన్ నొక్కిన ఆసరా డబ్బును, ఫిబ్రవరి 16న చేయూత డబ్బును, ఫిబ్రవరి 29న విద్యాదీవెన డబ్బును, మార్చిలో బటన్ నొక్కిన ఇబిసి డబ్బులు, ఆరోగ్యశ్రీకి ఇవ్వాల్సిన డబ్బులు నేటి వరకు లబ్ధిదారుల అకౌంట్లో వేయలేదని అన్నారు. మార్చి 15 నుండి 30 వరకు జగన్ తన అనుచరులకు రూ.13 వేల కోట్లు ఎలా ఇవ్వగలిగారని ఆమె ప్రశ్నించారు. మాజీ ఎంఎల్‌సి ద్వారాపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన జరుగుతుందని, దీన్ని ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పుట్టికే ఒక అరాచకమని, అటువంటి వ్యక్తి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం మన దౌర్భాగ్యమని విమర్శించారు. దీనికి రానున్న ఎన్నికల్లో అంతం చేయకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. జనసేన ఇంఛార్జి గేదెల రిశివర్దన్ మాట్లాడుతూ ఎంతో దూరదృష్టి గల చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉంటేనే అభివృద్ధి, సంక్షేమం అందించగలరన్న విశ్వాసంతో పవన్ కల్యాణ్ టిడిపితో పొత్తు పెట్టుకున్నారని అన్నారు. గిరిజన ఎంఎల్ఎ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న రాజన్నదొర వల్ల గిరిజనులకు ఉపయోగమేమీలేదని విమర్శించారు. అనంతరం మండల స్థాయి క్లస్టర్ బూత్ ఇంచార్జ్ లకు గ్రామాల్లో చేయబోయే కార్యక్రమాల గురించి, గత ఎన్నికల్లో ఏ బూత్‌లో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయన్న విషయాలను తెలిపారు. అరకు పార్లమెంటరీ ఉమ్మడి అభ్యర్థిని కొత్తపల్లి గీతను కార్యకర్తలకు, నాయకులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో సాలూరు, మక్కువ, మెంటాడ సాలూరు పట్టణ అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుల్ల వేణుగోపాల్, చలమూరు వెంకట్రావు, నిమ్మది తిరుపతిరావు, వెంకటరమణ, డొంక అన్నపూర్ణ, తొత్తడి నూకరాజు గోపాల్ , మాలతీ దొర, కోట లక్ష్మణ, మామిడి ప్రసాదరావు, మాజీ ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

పోడు వ్యవసాయ దిగుబడికి విత్తన గుళికలు

ప్రజాశక్తి - పాచిపెంట

విత్తన గుళికలను తయారు చేసుకుని పూడిలో చల్లుకున్నట్లయితే దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు చాపరాయివలసలో పోడు వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించడానికి తీసుకోవాల్సిన పద్ధతులను రైతులకు వివరిస్తూ ప్రస్తుతం పోడులో సాగు చేసే చిరుధాన్యాల దిగుబడి సాధారణ దిగబడుల కంటే సగం మాత్రమే ఉంటుందని, దీనికి కారణం పంటకు సరైన పోషకాలు అందకపోవడమేనని అన్నారు. ముందుగా ఎకరాకు 200 కిలోల ఘన జీవామృతాన్ని తయారు చేసుకుని పోడులో చల్లుకున్నాక విత్తన గుళికలను తయారు చేసుకుని చల్లుకోవాలని సూచించారు. అలాగే పంట కాలంలో కనీసం రెండుసార్లు ద్రవ జీవామృతాన్ని చల్లుకున్నట్లయితే పోడులో సాధారణం కంటే 20 శాతం అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. అనంతరం ప్రకృతి సిబ్బంది తిరుపతి నాయుడు, సురేష్ కుమార్ ఘనజీవామృతం తయారీని, విత్తన గులికుల తయారీని రైతులకు చూపించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ వ్యవసాయ సహాయకులు భారతి నానో యూరియా, నానో డిఎపిల ఉపయోగాలను వివరించారు.

4 నుంచి గుమ్మలక్ష్మీపురంలో యాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉమా సహిత కైలాసనాథ ఆలయం 41వ వార్షికోత్సవం సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో ఈనెల 4 నుంచి 8 వరకు ఐదు రోజుల పాటు యాత్ర నిర్వహిస్తున్నట్లు సర్పంచి బొత్తాడ గౌరీశంకర్రావు తెలిపారు. ఇందులో భాగంగా యాత్ర ఏర్పాట్లను ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, ఎస్ఐ శివప్రసాద్ మంగళవారం పరిశీలించారు. యాత్రను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యాత్ర ఏర్పాట్లు నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. జెయింట్ వీల్, డ్రాగన్ ట్రైన్,బ్రేక్ డాన్స్, బైక్ రైడింగ్ వంటి ఎన్నో వినోద కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఐదు రోజుల పాటు యాత్రను ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి నిమ్మక శేఖర్, ఉప సర్పంచ్ కిషోర్ కుమార్, దోస్త్ మేరా దోస్త్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

వైన్ షాపులు తొలగించాలంటూ మహిళల ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గోపాలపురంలో ప్రభుత్వ మద్యం షాపును తక్షణమే తొలగించాలంటూ మహిళలు స్థానిక సచివాలయం వద్ద ఆందోళనకు దిగారు. మద్యం షాపు నిర్వహణ ద్వారా అశాంతమైన వాతావరణం నెలకొంది. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. దీనికి తోడు.. గ్రామంలో బెల్టు షాపులు మరింత ఇబ్బందుల పాల్జేస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సచివాలయం మహిళా కానిస్టేబుల్‌కు సమస్యను వివరించారు.

వడగాల్పుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

వేసవిలో వడగాల్పుల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా వ్యవహరించాలని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు కోరారు.వ ంగళవారం పాఠశాలలో విద్యార్థులకు వడగాల్పులు – జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన కల్పించారు. వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. వడదెబ్బకు గురైతే జ్వరం, తలనొప్పి, నిద్ర పెట్టకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
O.S.No.4/2023

Between:
ఇండుపూరి వెంకట రాజు .... వాది
And:
మండవిల్లి సోమ శేఖర్ ....ప్రతివాది

నోటీసు

ప్రతివాది:
మండవిల్లి సోమ శేఖర్, తండ్రి వెంకట రాజు, గొర్లెవీధి, సాలూరు, పార్వతిపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీపై పై కోర్టులో దావా సొమ్ము రాబట్టు నిమిత్తము దావా వేసియున్నారు. సదరు దావా **తేదీ:3-4-2024**న శ్రీ కోర్టువారు వాయిదా వేయింపించి యున్నారు. వాయిదా దినం **ఉదయం 10.30 గంటల**కు మీరు గాని, మీ వలన ఆర్డరు పొందినవారు గాని, మీ తరుపున ప్లీడరుగారు గాని, పై కోర్టులో హాజరు అయి మీ తరుపున వాదన దాఖలు చేసుకొనవలెను. లేనిచో పై దావా మీ పరోక్షమున తీర్మానము జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

గొర్లె కిరణ్ కుమార్,
వాది తరుపు న్యాయవాది,
సాలూరు
సాలూరు
తేదీ: 3-4-2024